క్లుప్తంగా

మడకశిర ఎంఈఓ-2గా నరసింహమూర్తి



ఎమ్మెల్యే తిప్పేస్వామిని కలిసిన నరసింహమూర్తి

మడకశిర: మడకశిర ఎంఈఓ-2గా నరసింహమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అమరాపురం మండలం బసవనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న ఈయనను ప్రభుత్వం ఎంఈఓ-2గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే తిప్పేస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంఈఓ భాస్కర్ తదితరులు ఉన్నారు.

విద్యకు ప్రాధాన్యం



విద్యార్థులను సన్మానిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

లేపాక్షి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో మంచి పౌరులుగా రాణించాలని సర్పంచ్ అశ్వత్తనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కింద 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కే.మౌనికకు రూ. 3 వేలు, ఎస్. అంజలికి రూ. 2 వేలు, పుష్పాంజలికి వెయ్యి చొప్పున అందించారు. శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

రొళ్ల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఆజాద్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక సచివాలయం-1 ఆవరణలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతు గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిచాలన్నారు. జూలై 1 నుంచి 31వ తేది వరకు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈఓఆర్డీ కృష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలలో మంగళవారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. రొద్దం-1, రొద్దం-2లో ఉన్న 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రాత పరీక్ష నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. 18 ఖాళీలకు 200 మంది విద్యార్థులు రాత పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు.

ఈ- కేవైసీ చేయించుకోండి

అమరాపురం: మండలంలో పీఎం కిసాన్ 13వ విడత పడని రైతులు రైతు భరోసా కేంద్రం లేదా మీ సేవా కేంద్రానికి వెళ్లి ఈ- కేవైసీ చేయించుకోవాలని ఏఓ మంజునాథ తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా పడని రైతులు మండలంలో 157 మంది ఉన్నారన్నారు.

పోలీసులకు ప్రత్యేక శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పోలీసులు

పెనుకొండ: పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలోని పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాలతో పాటు మడకశిర నియోజకవర్గ మండలాలకు పోలీసులు స్థానిక ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సీఐ కరుణాకర్, ఎస్ఐ రమేష్ బాబు పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఆర్ ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ శిక్షణ ఇచ్చారు. విచ్ఛిన్నకర శక్తులను చెదరగొట్టడానికి, శాంతి భద్రతలు నెలకొల్పడానికి, అసాంఘిక శక్తులను ఎలా అదుపు చేయాలి.. ఉద్యమాలు చేసే సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పోలీసులు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



దేవగానపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

అమరాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవాం తమ్మడేపల్లి 2 గ్రామ సచివాలయం పరిధిలోని దేవగానపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లగా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అందిస్తున్న లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నేరవేర్చారని తెలిపారు. ఇంకనూ ఏవైనా గ్రామాల్లో సమస్యలు వుంటే గడప గడపకూ అధికారులతో వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికే కార్యక్రమం చేపట్టామన్నారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణం కార్యక్రమం పెద్ద ఎత్తున ప్రారంభమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో నిండు మనసుతో జగనన్నను దీవించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్లు వీరక్యాతరాయప్ప, లక్ష్మీదేవి, సర్పంచ్ గిరిజమ్మ, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ లలితమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు శివకుమార్, నాగేగౌడ, సదానందగౌడ, నారాయణ, ప్రసాద్, త్రిలోక్‌నాథ్ తిప్పయ్య, ఎంపీడీఓ మునిస్వామి, సచివాలయం అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ధ్యేయం

● ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

గోరంట్ల: కులమత రాజకీయలకతీతంగా ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందించడంతోపాటు అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయన తెలిపారు. మంగళవారం మండలంలోని కమ్మమవారిపల్లి పంచాయతీ పరిధిలోని ఎమకలగుట్టపల్లి, చౌండూరివాండ్లపల్లి, యర్రయ్యగారిపల్లి గ్రామాల్లో సర్పంచ్ సాపట్ల మణి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరయ్యారు. అనంతరం వారు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రాజకీయాలకతీతంగా నేరుగా పథకాలు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు పచ్చ చొక్కాలకే అందాయన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు కావాలంటే జన్మభూమి కమిటీలకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమత రాజకీయలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడంతోపాటు ఎలాంటి అక్రమాలకు జరగకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు వివరించారు. చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల ముందు ఆరు వందలకు పైగా ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరెడ్డి, గోరంట్ల మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, వానవోలు సహకార సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ ముఖ్యనాయకులు, సర్పంచులు , స్థానిక నాయకులు వీరనారాఆయణ రెడ్డి, జయపాల్‌రెడ్డి, అంగడి నారాయణరెడ్డి, రాజు, వెంకటరంగారెడ్డి, రామిరెడ్డి, మహీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రైతు పొలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామ సమీపంలో రైల్వే లైన్ ఏర్పాటుకు భూమి కోల్పోతున్న రైతు నాగిరెడ్డి పొలాన్ని సబ్ కలెక్టర్ కార్తిక్ మంగళవారం పరిశీలించారు. తన భూమిలో బావి ఉందని, తద్వారా పంట సాగు చేసుకునేవాడినని, పంట నష్టపోతున్నానని, న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు రైతు వినతిపత్రం అందించాడు. దీంతో రెవెన్యూ అధికారులతో కలిసి పొలాన్ని సందర్శించారు. పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ సురేష్, వీఆర్వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి సన్మానం

హిందూపురం: స్థానిక లక్ష్మీపురం 10వ వార్డు సచివాలయ ఉద్యోగి శంకర్‌రెడ్డి అనంతపురం కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వార్డు కౌన్సిలర్ పార్వతీ నాగరాజు, సచివాలయ ఉద్యోగులు మంగళవారం వీడ్కోలు పలికారు. శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర



పురవీధుల్లో సాగుతున్న జగన్నాథ రథయాత్ర

హిందూపురం: జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని హిందూపురం కొల్హాపూర్‌శ్రీ మహాలక్ష్మి ఆలయంలో హరినామ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకపూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి గురుపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలతో అలంకరించారు. నారికేళ అభిషేకాలు చేసి పుష్పయాగం, జగన్నాథలీల ప్రవచనాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. హరినామ సంకీర్తన యజ్ఞం ఆధ్వర్యంలో రథంపై జగన్నాథ బలభద్ర సుభద్ర ఉత్సవమూర్తులను కొలువుదీర్చి చిన్నమార్కెట్, ఎంఎఫ్‌రోడ్డు, గాంధీసర్కిల్, మెయిన్‌బజార్, పేట వెంకటరమణస్వామి ఆలయం గుండా భజనలు చేస్తూ రథోత్సవం కొల్హాపూరీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకూ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చిపూజలు నిర్వహించారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు రోడ్డెక్కారు. మంగళవారం గోరంట్ల రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసించారు. దీంతో ఆ రహదారి గుండా వాహనాలు ఆగిపోయాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని మహిళలు వాపోయారు. అక్కడికి చేరుకొన్న వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, మున్సిపల్ సిబ్బంది వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బోరు మరమ్మతులు చేయించామన్నారు. సీఐ ఈరన్న, సిబ్బంది అక్కడికి చేరుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు. అధికారులు నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

పోటీతత్వం పెంపునకే 'జగనన్న ఆణిముత్యాలు'



అమరాపురం: విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: విద్యార్థుల్లో పోటి తత్వాన్ని పెంచడానికి జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం గౌడనకుంట ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన టెస్ట్‌లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేశాన్నారు. బడి ఈడు పిల్లవాడు బడిలో ఉండాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక కిట్లు, జగనన్న గోరుముద్ద, ఉన్నత చదువుల కోసం ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ గిరిజమ్మ, రాష్ట్ర కుంచిటి వక్కలిగ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, వైస్ ఎంపీపీ లలితమ్మ, ఉపాధ్యాయులు, నాయకులు పిఆర్.మూర్తి, రంజిత్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర: విద్యార్థులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా అవార్డులు అందిస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నతపాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఏడాది టెన్త్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డుల ప్రదానంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా ప్రమాణాలు పెంచడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఎంఈఓ-2 నరసింహమూర్తి, హెచ్‌ఎం శకుంతల తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: పెద్దగువ్వలపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు మంగళవారం అవార్డులు ప్రదానం చేశారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, మెడల్, ప్రశాంసా పత్రం అందించారు. మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి రూ.1000 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జెట్టి మారుతీరెడ్డి, పేరెంట్స్ కమిటీ సభ్యుడు విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యంతో పట్టుబడిన టీడీపీ నాయకుడు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

రొద్దం: పాతర్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు యు.శంకరప్ప మంగళవారం రాత్రి కర్ణాటక మద్యంవిక్రయిస్తూ పట్టుబడ్డాడు. ఇంట్లో విక్రయిస్తుండగా దాడి చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. 40 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి



జుంజన్న(ఫైల్)

గుడిబండ: వీరజ్జనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జుంజన్న(81) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జీ.బీ.శివకుమార్ గ్రామానికి చేరుకుని జుంజన్న మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సర్పంచ్‌లు తిప్పేస్వామి, అశ్వథ్, నాయకులు రంగధామప్ప తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థితోపాటు తండ్రిని సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చూపిన సువర్ణభారతి కళాశాల విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. విభూతిపల్లికి చెందిన గోపాల్ కుమారుడు జి.శంషక్ ఓపెన్ క్యాటగిరీలో 3,093 ర్యాంకు, ముద్దిరెడ్డిపల్లికి చెందిన శ్రీరాములు కుమారుడు టి.సాయిగణేష్ 7,947 ర్యాంకు సాధించాడు. కళాశాల చైర్మన్ నీలకంఠరెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



ఎన్నికైన ఏఐసీఎఫ్ జిల్లా కమిటీ, యూత్ కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 27వ వార్షికోత్సవాన్ని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ అధ్యక్షతన మంగళవారం స్థానిక సీ అండ్ ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చ్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీ, యూత్ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా సాల్మన్ రాజ్, కార్యదర్శిగా డేవిడ్ ట్రెజరర్‌గా ఆనంద్ రాజ్, ఉపాధ్యక్షుడిగా సర్వేశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీగా రమేష్ పిలిప్, జాయింట్ ట్రెజరర్‌గా ప్రసాద్, సభ్యులుగా సుందర్ రాజ్, క్రీస్తు మూర్తి, పాస్టర్ సాల్మన్, జోసెఫ్‌లను నియమించారు. అలాగే యూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుదాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డేనియల్, కార్యదర్శిగా జానీ, ట్రెజరర్‌గా అబ్రహం, జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేష్, సభ్యులుగా జేమ్స్, షాలేంలను నియమించారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ స్టీఫెన్ రాజ్, ఆనంద రాజ్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, ఏఐసీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, పాస్టర్లు జయరాజ్, దేవరాజ్, సాల్మన్ రాజ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చేసిన అభివృద్ధిని వివరిస్తాం

హిందూపురం: దేశంలో తొమ్మిదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు వజ్రాభాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కేంద్ర మంత్రి శ్రీ దేవిసింగ్ జైసింగ్ చౌహాన్ హిందూపురంలో రెండురోజులు పర్యటించనున్నట్లు చెప్పారు. కార్యక్రజమంలో నాయకులు వెంకటేష్, అంజినేయులు, అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నాడు-నేడు పనుల పరిశీలన

రొద్దం: మండలంలోని చోళేమర్రి గ్రామంతో జరుగుతున్న నాడు-నేడు పనులు, ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో పలు రికార్డులు తనిఖీ చేశారు. నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధి పనులను తనిఖీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ హరికృష్ణ ఉన్నారు.

కేసు నమోదు

రొళ్ల: ఆవినకుంట తండాలో పబ్లిక్ కొళాయి ఏర్పాటు విషయంపై జరిగిన ఘర్షణలో పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ బాలాజీ సమాచారం మేరకు.. పబ్లిక్ కొళాయి ఏర్పాటు విషయంపై ధర్మనాయక్, గోపాల్‌నాయక్ గొడవపడ్డారు. ఈక్రమంలో ధర్మనాయక్ అనే వ్యక్తి గోపాల్ నాయక్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

రొళ్ల: మండల కేంద్రంలో రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు మంగళవారం హిందూపురం ఎంవీఐ శివశంకర్ తెలిపారు. అందులో మూడు ట్రాక్టర్లు రూ.54 వేలు, ఒక గ్రానైట్ లారీకి రూ.20 వేలు, ప్రైవేటు పాఠశాల బస్సుకు రూ.14 వేలు జరిమానా విధించామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుకొండ రూరల్: పట్టణ సమీపంలోని పేకాట ఆడుతున్న ఐదురిని ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

పెనుకొండ రూరల్: మావటూరులో అన్నదమ్ములు మధ్య సెంటు భూమి కోసం మంగళవారం ఘర్షణ జరిగింది. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన గోవిందప్ప నరసప్ప,అన్నదమ్ములు. సొంత పొలంలో రహదారికి సెంట్ భూమి కోసం పరస్పరం దాడి చేసుకున్నారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు పింఛన్ పత్రాల పంపిణీ

పావగడ: నిడుగల్ హోబళి హరిహరపుర గ్రామానికి చెందిన ఎస్సీ,ఎస్టీ బీసీ సామాజిక వర్గాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ భద్రతా యోజన కింద సంధ్యా సురక్ష, వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, మనస్విని పింఛన్ల పత్రాలను బీపీఎస్ సంఘం పదాధికారులు మంగళవారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. బీపీఎస్ రాజ్యాధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది ప్రా హరిరాం, హెచ్ డి ఈరణ్ణ, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన కల్పించండి

చిలమత్తూరు: కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి డా. తేజశ్విని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ గంగాధర్,ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని ప్రతి ఇంటినీ సందర్శించి కుష్టు బాధితులను గుర్తించాలని వైద్యాధికారి నరేష్ కుమార్ సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మనోహర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, పీహెచ్ఎన్ వెంకట సుబ్బమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ

పరిగి: స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో రెండో విద్యాధికారిగా శేషాచలం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు- నేడు పథకం నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

పెనుకొండ: పెనుకొండ ఎంఈఓ -2 గా నియమితులైన సుధాకర్‌ను యూటీఎఫ్ నాయకులు ఎమ్మార్సీ వద్ద సన్మానించారు. మంగళవారం ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, రమేష్, రవీంద్ర, కృష్ణానాయక్ సన్మానించారు. ఎంఈఓ గంగప్ప ఉన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసుపై విచారణ

గోరంట్ల: ఎస్సీ,ఎస్టీ కేసుపై డీఎస్పీ హుసేన్‌పీరా మంగళవారం విచారణ చేపట్టారు. ఈనెల 14న పులేరు స్టోర్ డీలర్ బూచేపల్లి కిష్టప్పను ఓ విలేకరి కులం పేరుతో దూషించి, డబ్బులు డిమాండ్ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీలర్ ఫిర్యాదు మేరకు గోరంట్ల పోలీసులు ఈశ్వరరాయల్ పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు. పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, విచారించారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ ఇక్బాల్ బాషా పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుడిబండ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. మంగళవారం కే.ఎన్.పల్లి గ్రామ సమీపంలో రైతుల పొలాల్లో 200 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకొని, వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏపీఓ బార్గవి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నరహరి, టీఏ మారేగౌడు, ఎఫ్ఎ తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

హిందూపురం అర్బన్: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన రామాంజనేయులు, సురేష్ గాయపడ్డారు. హిందూపురం- పోచనపల్లి రహదారిలో సప్పలమ్మ గుడి సమీపంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ భవనానికి స్థలం పరిశీలన

అగళి: ఆలుడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం కోసం మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బసవరాజు నాయకులు బసవరాజు, శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.

ఘనంగా కొండూరు జన్మదిన వేడుకలు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. రహమత్‌పురంలోని ప్రేమసదన్‌లో హసీనా బండ్లపల్లి జబీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పిల్లలందరికీ కేకులు, పళ్లు పంపిణీ చేశారు. సానీ ముత్తవల్లి రఫీక్‌సాబ్, హఫీజ్, అక్రం , నయాజ్, సుహెల్ మహబూబ్‌బాష పాల్గొన్నారు.

పరిగి: హిందూపురం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా మందిరం ప్రశాంతి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం చేశారు. వృద్ధులు, అనాథల సమక్షంలో కొండూరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో అన్నదానం చేశారు. బ్రహ్మానందరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డిపల్లి నరసింహారెడ్డి, శివరామిరెడ్డి, రవీంద్ర, కుమార్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వమిత్వ సర్వే

సోమందేపల్లి: పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కొత్తపల్లిలో స్వమిత్వ సర్వే పకడ్బందీగా చేసినట్లు డీపీఓ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 276 ఇళ్లకు సంబంధించి హద్దులు, కొలతలపై సర్వే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివారెడ్డి, తహసీల్దార్ సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజురావు, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం అర్బన్ : సింగరెడ్డి ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి రామాంజనేయులు (30) ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సిఐ ఈరన్న తెలిపారు. వ్యవసాయం వలన జీవనం సాగించే వారని అప్పుల బాదతో ఆత్మహత్య చేసుకొన్నట్లు కుటుంబీకులు తెలుపుతున్నారని, కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని తెలిపారు.